క్లుప్తంగా

డ్రైనేజీ పనులు ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి : స్థానిక విజయనగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. సోమవారం ఈ మేరకు కాలనీలో శిలాఫలకం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సుమారు రూ.2.8 కోట్ల తుడా నిధులతో డ్రైనేజి నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. 45 రోజుల్లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం రెడ్డివారిపల్లె వద్ద నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేఖర్, జెడ్పీటీసీ సభ్యుడు చిల్లకూరి యుగంధర్ రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరంగారి రమేష్ రెడ్డి, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, బాలకృష్ణమూర్తి, సక్కూరు ధనుంజయ రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

పాకాల : మండలంలోని చిన్నగోర్పాడు దళితవాడలో తాగునీటి సమస్య పరిష్కారమైంది. సోమవారం ఈ మేరకు స్థానికులు మాట్లాడుతూ డిప్యూటీ ఈఓ జి.దేవేంద్ర సొంత నిధులతో మోటారు, పైపులైను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వినాయక యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో దేవేంద్ర సహకారంతో తమ దాహార్తి తీరినట్లు వివరించారు. మొత్తం రూ.50వేలతో పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డి.బాలాజీ, చంద్రశేఖర్, కృష్ణమూర్తి, ప్రకాష్, మణి, అలమేలు, రజని పాల్గొన్నారు.

2న బ్రాహ్మణ 'వివాహ వేదిక'



మాట్లాడుతున్న సీఆర్‌కే శేషగిరిరావు

తిరుపతి కల్చరల్ : శ్రీవేంకట గాయత్రి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన ఇస్కాన్ వద్ద కంచి మఠంలో బ్రాహ్మణ వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు సీఆర్‌కే శేషగిరిరావు తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. పరిచయ వేదికలో భాగంగా ఉదయం 4 నుంచి 8 గంటల వరకు 60 ఏళ్ల పైబడిన వృద్ధులకు షష్టిపూర్తి, 70 ఏళ్ల పైబడిన వారికి భీమరథ శాంతి, 80 ఏళ్ల పైబడి బ్రాహ్మణ దంపతులకు సహస్ర చంద్ర దర్శనం ఉంటుందన్నారు. అనంతరం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బ్రాహ్మణ యువతీయువకుల వివాహ పరిచయ వేదిక జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా వధూవరుల వివరాలతో కూడిన విశ్వవాణి పుస్తకం పంపిణీ చేయనున్నట్లు వివరించారు. సమావేశంలో ట్రస్ట్ ప్రతినిధులు సుబ్బారావు, విశ్వనాథ్, హనుమంతరావు, కామేశ్వరరావు, పి.పద్మావతి, బి.జయలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

11 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 11 మందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పినట్లు కోర్టు సూపరింటెండెంట్ ఎన్.వి సుబ్బారెడ్డి తెలిపారు.

వేడెక్కిన రాజకీయం!

తిరుపతి రాజకీయం మరోసారి వేడెక్కింది. నగరపాలక సంస్థపై పట్టు కోసం పార్టీల నడుమ పోరు మొదలైంది. డిప్యూటీ మేయర్ ఎన్నికలో విజయం సాధించేందుకు కార్యాచరణ ప్రారంభమైంది. సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయగానే ఆశావహుల ఆరాటం అధికమైంది. ఈ క్రమంలో ఎలాగైనా పదవిని దక్కించుకోవడమే లక్ష్యంగా కుట్రలకు కూటమి తెరతీస్తోంది. ఇప్పటికే గోడ దూకిన కార్పొరేటర్లతో పన్నాగాలు పన్నుతోంది. అయితే కౌన్సిల్‌లో సంపూర్ణ మెజారిటీ ఉండడంతో వైఎస్సార్‌సీపీ ధీమాగా వ్యవహరిస్తోంది. ఎవరినీ ప్రలోభాలకు గురి చేయకుండా హుందాగా అడుగులు వేస్తోంది.

- ఫిబ్రవరి 3న డిప్యూటీ మేయర్ ఎన్నిక
- నోటిఫికేషన్ విడుదల చేసిన ఎలక్షన్ కమిషన్
- పదవి దక్కించుకునేందుకు కూటమి కుట్రలు
- సంపూర్ణ ఆధిక్యం ఉండడంతో ధీమాగా వైఎస్సార్‌సీపీ నేతలు



తిరుపతి తుడా : తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఎన్నిక నోటిఫికేషన్‌తో తిరుపతి రాజకీయం హాట్ హాట్‌గా మారింది. గతంలో నిర్వహించిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 50 డివిజన్లకు గాను 48 స్థానాలను వైఎస్సార్‌సీపీ సొంతం చేసుకుంది. కోర్టులో కేసు కారణంగా 9వ డివిజన్‌లో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. టీడీపీ కేవలం 35వ డివిజన్‌లో మాత్రమే గెలుపొందింది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ తరఫున నగర తొలి మేయర్‌గా బీసీ మహిళ డాక్టర్ శిరీషకు అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి అవకాశం కల్పించారు. అలాగే బలిజ సామాజిక వర్గానికి చెందిన ముద్ర నారయణను డిప్యూటీ మేయర్ పదవిలో కూర్చోబెట్టారు. రెండవ డిప్యూటీ మేయర్ పదవి అవకాశం ఉండడంతో భూమన అభినయ్‌రెడ్డి ఎన్నికయ్యారు. తిరుగులేని మెజారిటీ కారణంగా అప్పట్లో ఎన్నిక ప్రక్రియ ఏకగ్రీవంగానే పూర్తయ్యింది. తదనంతరం సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాల్సిరావడంతో భూమన అభినయ రెడ్డి డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న రెండవ డిప్యూటీ మేయర్ స్థానానికి సోమవారం రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 30వ తేదీలోపు ఎన్నికల నిర్వహణకు సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించింది. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 11 గంటలకు డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రారంభించాలని పేర్కొంది.

పదవి కోసం పన్నాగాలు

డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమి నేతలు పన్నాగాలు పన్నుతున్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి ఫిరాయించి తమ పంచన చేరిన కార్పొరేటర్లతో మరికొందరికి గాలం వేసేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. కూటమి కుట్రలు ఏమాత్రం ఫలించవని, డిప్యూటీ మేయర్ స్థానం తమదే అని వైఎస్సార్‌సీపీ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నేతల కొనుగోళ్లు

సార్వత్రిక ఎన్నికల సమయంలో కొంతమంది కార్పొరేటర్లను కూటమి నేతలు కొనుగోలు చేశారు. జనసేన అభ్యర్థిగా బరిలో దిగిన ఆరణి శ్రీనివాసులుకు ఐదురుగు కార్పొరేటర్లు అమ్ముడుపోయారు. మరో నలుగురు కార్పొరేటర్లు లోలోపల ఆరణికి సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో కూటమి కింద దాదాపు 10 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వైఎస్సార్‌సీపీకి మొత్తం 48 మంది ఉండగా, అందులో 24వ డివిజన్ కార్పొరేటర్ హనుమంతనాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. ఇక ఫిరాయించిన వారిని వదిలేస్తే ప్రస్తుతం 37 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఈ మేరకు కౌన్సిల్‌లో మెజారిటీ ఉండాలంటే 24 మంది కార్పొరేటర్లు సరిపోతారు. అలాగే ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం ఇద్దరికీ కౌన్సిల్ ఓటు హక్కు ఉంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీకి బలం 39కి చేరింది.

వర్సిటీల్లో నేటి కార్యక్రమాలు

తిరుపతి సిటీ : తిరుపతిలోని పలు యూనివర్సిటీల్లో మంగళవారం ప్రత్యేక సదస్సులు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

- పద్మావతి మహిళా వర్సిటీలోని ద్రితీ సెమినార్ హాల్‌లో 'సెలెస్టా–2025' జాతీయ స్థాయి టెక్‌ఫెస్ట్
- ఎస్వీయూలోని శ్రీనివాస ఆడిటోరియంలో సుభాష్ పాలేకర్ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు జాతీయ సదస్సు
- సంస్కృత వర్సిటీలో రెండురోజుల పాటు జరిగే ' వైఖానస పాంచరాత్ర ఆగమ' జాతీయ సెమినార్ ప్రారంభం. అలాగే భారతీయ జ్ఞానవ్యవస్థపై అగస్త్యమహర్షి కృషి అనే అంశంపై జాతీయ సదస్సు
- ఎస్వీయూ ప్రధాన ద్వారం నుంచి రవాణాశాఖ ఆధ్వర్యంలో హెల్మెట్‌పై ద్విచక్ర వాహనదారులతో అవగాహన ర్యాలీ. అలాగే ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా మహాసభలు ప్రారంభం.

శ్రావణికి డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగ పరిశోధకులు చెరకోల శ్రావణి డాక్టరేట్ పొందారు. ప్రొఫెసర్ ఎస్.వి జయభాస్కర్‌రావు పర్యవేక్షణలో 'స్పేషియో– టెంపో ఆల్ క్యారెక్టరెక్టిక్స్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ సాయిల్ మాయిశ్చర్ ఓవర్ ఇండియా యూజింగ్ గ్రౌండ్ బేస్ట్, శాటిలైట్ అండ్ మోడల్ డేటా సెట్స్' అంశంపై ఆమె పరిశోధన పత్రాలు సమర్పించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతి అర్బన్ : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల క్యాలెండర్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఆవిష్కరించారు. అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ పాల్గొన్నారు.

'తైక్వాండో'లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : బెంగళూరులో నిర్వహించిన విఫా కప్ తైక్వాండో పోటీల్లో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. సి.ఢిల్లీబాబు స్వర్ణం, రజతం, డి.శరత్ రెండు స్వర్ణ పతకాలు సాధించారు. సోమవారం ఈ మేరకు విద్యార్థులను పాఠశాల జోనల్ ఇన్‌చార్జి రమేష్, డీన్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఉమాదేవి అభినందించారు.

43మందికి ఉద్యోగాలు



ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

తిరుపతి సిటీ: స్థానిక భవానీ నగర్‌లోని గేట్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 43మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించినట్లు కళాశాల ఛైర్మన్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.

హర్షిత్‌రెడ్డికి సత్కారం



చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని సన్మానిస్తున్న నేతలు

భాకరాపేట : వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డిని సోమవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎర్రావారిపాళెం మండలం విద్యార్థి, యువజన సంఘాల నేతలు ఓబుల్ రెడ్డి, చెంగల్‌రెడ్డి, వీరనాగేంద్ర, వెంకటరమణనాయక్, సురేష్‌నాయక్, రెడ్డినాయక్ పాల్గొన్నారు.

కూటమి నేతల దందాపై ఆందోళన



ధర్నా నిర్వహిస్తున్న వీధి వ్యాపారుల సంఘం నేతలు

తిరుపతి కల్చరల్ : కూటమి నేతల దందాపై వీధి వ్యాపారులు ఆందోళనకు దిగారు. సోమవారం నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వీధి వ్యాపారుల సంఘం మహాసభ నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ మాట్లాడుతూ కూటమి నేతల అక్రమ వసూళ్లను అడ్డుకోవడంలో ఎమ్మెల్యే, కమిషనర్ విఫలమయ్యారని ఆరోపించారు. వీధి వ్యాపారుల చట్టం అమలు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ర్యాలీగా పురపాలక కార్యాలయానికి చేరుకుని ధర్నాకు దిగారు. వీధి వ్యాపార కార్మిక ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శివకుమార్ మాట్లాడుతూ వీధి వ్యాపారులకు అండగా నిలవకుంటే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నేతలు ఎన్‌డీ రవి, శ్రీనివాసులు, బాలాజీ, సుధాకర్, సరితమ్మ, శ్యామ్‌కుమార్, కాంచనమ్మ, విజయకుమార్, రమేష్, పెంచలమ్మ, అహ్మద్‌బాషా, రూప పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినతులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్

తిరుపతి తుడా : ప్రజలు అందించే వినతుల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఫోన్ ద్వారా 8 మంది, మరో 45 మంది వినతులు ద్వారా సమస్యలు విన్నవించారని అదనపు కమిషనర్ తెలిపారు. వాటిని ఆయా విభాగాల అధికారులకు పంపించామని వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

'స్కోడా' న్యూ కైలాక్ కారు ఆవిష్కరణ



కారు ఆవిష్కరిస్తున్న నరసింహయాదవ్, షోరూమ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డులోని స్కోడా షోరూమ్‌లో న్యూ కై లాక్ కారును సోమవారం సాయంత్రం తుడా మాజీ ఛైర్మన్ నరసింహయాదవ్, స్కోడా ఏపీ సేల్స్ హెడ్ యు.శ్రీనివాసులు, తిరుపతి బ్రాంచి హెడ్ టి.కేశవయ్య ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఈ వెహికల్‌ను ఆధునాతన సౌకర్యాలతో రూపొందించినట్లు తెలిపారు. స్కోడా కైలాక్ టెక్నికల్ స్పెసిఫికేషన్స్ ఇంజిన్ టైప్ 1.0 టీఎస్‌ఐ టెక్నాలజీతో 999సీసీ కెపాసిటీతో పెట్రోల్ వేరియర్స్‌లో లభిస్తుందని వెల్లడించారు. క్లాసిక్ బేసిక్ మోడల్ రూ. 7,89,000లతో ప్రారంభమవుతుందన్నారు. అలాగే సిగ్నేచర్ – రూ. 9,59,000 లు, సిగ్నేచర్ ప్లస్– రూ. 11,40,000, ప్రిస్టేజ్ టాప్ మోడల్ – రూ.13,35,000లతో అందుబాటులో ఉందని వివరించారు.

హెల్మెట్ వినియోగంపై నేడు ర్యాలీ

తిరుపతి మంగళం : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా రవాణాశాఖాధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు ఎస్వీయూ నుంచి అలిపిరి గరుడ సర్కిల్ వరకు ర్యాలీ సాగుతుందని వెల్లడించారు.

ఆక్రమణలను ఉపేక్షించం



సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ పరిధిలో ఆక్రమణలను ఉపేక్షించే ప్రసక్తే లేదని కమిషనర్ మౌర్య హెచ్చరించారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించారు. కొరమేనుగుంట, గొల్లవానిగుంటలో పారిశుద్ధ్య పనులతో పాటు దుకాణాల వద్ద చెత్త బుట్టల ఏర్పాటు, ప్లాస్టిక్ కవర్ల వినియోగం, మురుగునీటి కాలువలను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా భవననిర్మాణాలు, రోడ్డు ఆక్రమణలను సహించమన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగం లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు గోమతి, డీఈ రమణ , హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఏసీపీ బాలాజీ, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి పాల్గొన్నారు.





అంబేడ్కర్ ఆశయ సాధనకే 'సంవిధాన్'

చంద్రగిరి : అంబేడ్కర్ ఆశయ సాధన కోసం సంవిధాన్ కార్యక్రమం నిర్వహించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు రాజులగారి పురుషోత్తం రెడ్డి తెలిపారు. సోమవారం ఈ మేరకు భరతమాత, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలు వేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు గాలి పుష్పలత, వెంకటముని, సుబ్రమణ్యం యాదవ్, మునిగంగ రెడ్డి, కాయం హరినాథ్ రెడ్డి, దొరస్వామి, నరేష్ నాయుడు, కృష్ణమూర్తి నాయుడు, మోహన రాజు, నవీన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారులకు ప్రశంస



ప్రశంసాపత్రం అందుకుంటున్న నాగమల్లేశ్వర్‌రెడ్డి, రామచంద్ర

తిరుపతి క్రైం : గణతంత్ర వేడుకల సందర్భంగా ఆదివారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వర్‌రెడ్డి, అర్బన్ సీఐ రామచంద్రకు ఆ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ ప్రశంసాపత్రాలు అందించారు.

వేర్వేరు దుకాణాల్లో చోరీ



కందులవారిపల్లెలో చోరీకు గురైన దుకాణం

చంద్రగిరి: మండలంలో దొంగలు చెలరేగిపోతున్నారు. మూడు రోజుల క్రితం ఓ ఇంటిని లూటీ చేసిన దుండగులు, తాజాగా రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడిన ఘటన మండల పరిధిలోని కందులవారిపల్లి, శేషాపురంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. కందులవారిపల్లి, శేషాపురానికి చెందిన దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు నిత్యావసరాల దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఆదివారం రాత్రి వ్యాపారాలు ముగించుకుని దుకాణంకు తాళాలు వేసి వెళ్లారు. ఈ క్రమంలో అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు రెండు దుకాణాలకు ఉన్న తాళాలను పగులగొట్టి నగదు, వస్తువులును దోచుకెళ్లారు. సోమవారం ఉదయం యజమానులు చూసి ఖంగుతిన్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 71 ఫిర్యాదులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు జిల్లా నలు మూలల నుంచి 71 ఫిర్యాదులు వచ్చినట్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావా దేవీలు ఉన్నట్టు వెల్లడించారు. వెంటనే సంబంధిత అర్జీలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

'వెరిటాస్'లో గణతంత్ర వేడుకలు



పరేడ్‌కు వస్తున్న వీవీ రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని సి.రామాపురం వద్ద వెరిటాస్ సైనిక్ స్కూల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో, నిబద్ధత కలిగిన పౌరులుగా తయారవుతారని చెప్పారు. పాఠశాల డైరెక్టర్ శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ సమైక్యత భారతదేశ ప్రత్యేకతని వెల్లడించారు. స్కూల్ డైరెక్టర్ సందీప్, డీన్ ఖాన్, ప్రిన్సిపల్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపల్ నాగార్జున పాల్గొన్నారు.

స్విమ్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్

పాకాల : మండలంలోని మద్దినాయనపల్లెలో తిరుపతి స్విమ్స్ వైద్యులు క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించారు. సోమవారం స్థానిక సచివాలయం వద్ద సర్పంచ్ గిరిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పరీక్షలు చేపట్టారు. దామలచెరువు వైద్యాధికారి హరిత,కార్యదర్శి చంద్రమౌళి, ఎంఎల్‌హెచ్‌పీ మీనా పాల్గొన్నారు.